# సజీవ స్మృతులు

ప్రతి వ్యక్తికి తన బాల్యం గుర్తుకు వచ్చినప్పుడు చాలా సంతోషం కలుగుతుంది. రోజులు, సంవత్సరాలు మారుతున్న కొద్దీ, గడిచిన దినాలే చాలా బాగున్నట్లనిపిస్తాయి. వయసుతోపాటు ఆలోచనా సరళి మారి, వ్యాపార దృష్టి అలవడి అతని వ్యక్తిత్వం వక్రీకరిస్తుంది. సంఘంలో అందరూ తనను గుర్తించి, గౌరవించాలనే తాపత్రయం మొలకెత్తి మహా వృక్షంలా విస్తరిస్తుంది. తనకు తెలియకుండానే కీర్తికాంక్ష, ధన కాంక్ష, మరే విధమైన స్వార్థమో ఉండి నిగూఢంగా నడిపిస్తుంది. చదువుకునే కాలంలో ఉపాధ్యాయుల మెప్పు పొందాలనీ, తోటి విద్యార్థులపై తన ఆధిక్యం చూపాలనీ, ఉద్యోగం చేసేటప్పుడు ధనం సంపాదించాలనీ, తోటి వారిని తన చుట్టూ తిప్పుకొని తన ఔన్నత్యం చాటుకోవాలనీ, ఆఖరికి తను చేసుకునే పెళ్లితో, తను చేసే తన పిల్లల వివాహాలతో కూడా సంఘంలో పరపతి, పరువు ప్రతిష్ఠలను పెంపొందించుకోవాలనీ ప్రతి మనిషి తపిస్తాడు. తన స్నేహితులచే, పరిచయస్థులచే గౌరవించబడాలనీ, కీర్తించబడాలనీ ప్రాకులాడటం ప్రతిజీవికీ సహజం. తన సంతానం ద్వారా కూడా సంఘం నుంచి తా నాశించిన ప్రయోజనాల కోసమే తాపత్రయపడతాడు. కానీ, బాల్యంలో ఇటువంటి ఆలోచనలు, కోరికలు ఏవీ ఉండవు. కనకనే మానవ జీవితంలో చీకూ చింతలూ లేక గడిచిన తమ బాల్యం అంటే అందరికీ మక్కువ ఎక్కువ. చనిపోయే రోజు వరకూ ఈ సజీవ స్మృతులు అందరినీ వెంటాడుతాయి. అవతార పురుషుడైన శ్రీ కృష్ణుడు కూడా కుచేలుడు తనని కలుసుకున్నప్పుడు తన రాజకీయాలు గానీ, కుచేలుని జీవితం గురించి గానీ కాక తమ బాల్యం గురించిన ముచ్చటలతోనే గడిపాడు.

సెలవులకని ఇంటికి వెళుతూ రెండు రోజు లుందామని మా బాబాయిగారి బలవంతం మీద బెజవాడలో వాళ్లింట్లో ఆగాను. అప్పుడు మా తాతయ్య గురించి, "ఉన్నారా" అని అడుగుతూ ఒక వయసు మళ్లినాయన వచ్చారు. "పూజ చేసుకుంటున్నారు. కొద్ది సేపట్లో వస్తారు. కూర్చోండి" అని కుర్చీ చూపించాను. కాలం దొర్లించటానికి నా గురించి కొన్ని ప్రశ్నలు వేసి తను వచ్చిన పనిగురించి చెప్పటం మొదలు పెట్టారు. "నేనూ, మీ తాత గారూ చిన్నప్పటి స్నేహితులం. కొంత కాలం కలిసి చదువుకున్నాం. ఉద్యోగం కూడా కొంతకాలం ఒకేచోట చేశాం. చూచిపోదామని వచ్చాను." ఆయన అభిమానం నన్ను చాలా ముగ్ధుణ్ణి చేసింది. "నా అన్నదమ్ములు పోయి చాలాకాలమయింది. ఇక తోబుట్టువులు లేరు. చిన్ననాటి స్నేహితులలో మీ తాతగారు మటుకే మిగిలారు." ఏమనాలో తోచక



సానుభూతిగా ఆయన చెప్పే మాటలు వింటూ కూర్చున్నాను. "కొడుకులూ, కూతుర్లూ తమ తమ సంసారాలు చేసుకుంటూ తలా ఒక చోట ఉన్నారు. నాకు ఈ ఒంటరితనం చాలా భయంకరంగా ఉంటూంది. అప్పుడప్పుడు వాళ్ళ వద్దకు వెళ్ళి వస్తూంటాను. కానీ, ఈ ఒంటరితనం నన్ను వదలదు. ఒక నాడు నా వాళ్ళు అంటూ ఎంత పెద్ద పరిధి గీసుకున్నానో, అది అంతగా నానాటికీ చిన్నదయిపోతున్నది." వాపోతున్నట్లుగా బాధతో ఆయ నన్న మాటలు ఎందుకో నా కప్పుడు చిన్నగా నవ్వు తెప్పించాయి. ఆయనా కోపం తెచ్చుకోక తను కూడా చిన్నగా నవ్వుతూ, "నా వయసులో నాలుగో వంతు వయసు లేదు నీకు. చాలా చిన్న వాడివి. నా అంత వయసు వచ్చినప్పుడు నీ కర్థమవుతుంది. దానికి చాలా రోజుల గడువు ఉందిలే" అన్నారు. నా కా నాడు అర్థం కాని మాట నిజమే అయినా, ఆయ నన్న మాటలలోని భావం త్వరలోనే ఒక విచిత్రమయిన సంఘటనతో తెలిసి వచ్చింది.

పరీక్షల తరవాత సెలవ లెంత ఆనందాన్నిస్తాయో, అంతే ఆనందాన్ని నా కెందుకో సెలవు లయిన తరవాత మొదటి రోజు క్లాసులుకూడా ఇస్తాయి. నెలరోజుల సెలవుల తరవాత అందరమూ కలుసుకుంటే ఒకళ్ళ నొకళ్ళు చూసుకొని, పోతున్న ప్రాణం తిరిగి వచ్చినంత సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అవుతాము. వాళ్ళందర్నీ నా ఆత్మీయులుగా, ఇష్ట సఖులుగా కనిపిస్తారు. నవ్వు మొహాలతో ఒకరి నొకరు 'హలో' అని పలకరించుకుంటూ, షేక్ హాండ్లు చేస్తూ కౌగిలించుకున్నంత పని చేస్తూంటే వచ్చే థ్రిల్‌ను ఎక్కడ ఆలస్యంగా పొందుతానో అని నా వాళ్ళందరనూ చేరాలని చాలా ఆరాటంగా సెలవు లయిపోగానే రైల్లో కూర్చున్నాను. అప్పుడే నా కొక ప్రయాణికుడు తగిలాడు. అతన్ని ఎక్కడో చూశాను అని పదే పదే అనిపిస్తున్నా, నాకు చొరవ తీసుకుని అతన్ని పలకరించే సాహసం లేకపోయింది. అందుకనే రైల్లో విసుగు పుట్టకుండా ఉండేందుకు కొనుక్కున్న పుస్తకాన్ని తీసి చదవడం మొదలుపెట్టాను.

పుస్తకాన్నయితే తెరిచాను కానీ, దాని మీద మనసు నిలువలేదు. "విద్యుల్లత వెదజల్లే వెలుతురు నన్ను మైమరపించేది. నీ చిరునవ్వు చూచిన తరవాత విద్యుల్లత వెలవెల బోతున్న ట్లనిపిస్తూంది. వసంత కాలంలో తెలతెలవారుతున్నప్పుడు పక్షులు చేసే కిలకిలారావాలు నన్ను రంజింప జేసేవి. నే డవి మనసును ముగ్ధం చేసే తమ పలుకులు నీ నుండి నేర్చుకున్నాయనిపిస్తూంది. గలగల పారే నదీ ప్రవాహంలో ఉన్న సవ్వడి, కోయిల రాగంలో ఉన్న మాధుర్యం, నెమలి నాట్యంలోని నేర్పరితనం అన్నీ నీ అనుకరణలా అని అనుమానం వేస్తూంది. చిరుగాలిలో నీవేదో సందేశం పంపావని ప్రస్తుతాన్ని మరిచి చెవులు దోరపెట్టి వింటాను. ఏమీ ఉండదు." నా కిటువంటి వర్ణనలంటే చెడ్డ చిరాకు. కొద్ది సేపు పుస్తకం మూయకుండానే నా తోటి ప్రయాణికుణ్ణి గమనించసాగాను. వేగాన్నందుకుంటున్న రైలు ఇంజనునుంచి బొగ్గు రవ్వలు మీద పడుతూంటే, అతను కిటికీలు మూసి వచ్చి తన స్థానంలో కూర్చున్నాడు. అనాలోచితంగా నన్ను అతనితో పోల్చుకోవటం మొదలు పెట్టాను. నా అంత పొడుగు లేడు కానీ, మామూలు ఎత్తు, దానికి తగ్గ లావు ఉన్నాడు. నాకంటే మంచి రంగులో ఉన్నా, నా వంకీల జుట్టు, నా ఖరీదయిన గుడ్డలు, నా చదువు గుర్తుకువచ్చి, అతను నా కంటే తక్కువ వాడయి ఉంటాడని ఒక తేలిక భావ మేర్పడిం దతని మీద. బహుశా అదే అతను నన్నెన్నడో చూశానంటే, నే నత న్నెప్పుడూ చూడలేదని ఒక క్రూరమైన అబద్ధం ఆడటానికి కారణమయి ఉంటుంది.

"ఎక్స్క్యూజ్ మీ. నా పేరు ప్రసాద్. మే ఐ నో యువర్ గుడ్ నేమ్ ప్లీజ్?" అని అత నడిగాడు.

"నా పేరు కుమార్. మెడికల్ స్టూడెంట్‌ను" అని జవాబిచ్చాను.

తరవాత సంభాషణలో నేను చదువుతున్న సంవత్సరమూ, కాలేజీ తెలుసుకున్నాడు. మే మిద్దరమూ ఒకే ఊరు వెళుతూండటంతో నా మీద ఆసక్తి కనపరుస్తున్నా డనుకున్నా. అతను మా ఊర్లో కొంతకాలం క్రిందట ఉండే వాడట. ఆ ఊర్లో తన స్నేహితులను చూడ్డానికి వెళుతున్నాడట. తరవాత అతను తన బాల్యం గురించి తన్ను తాను మరిచి, తన సంభాషణ చాతుర్యంతో నన్ను కట్టివేసి, నాకు విసుగు కలగని పద్ధతిలో చెప్పటం మొదలు పెట్టాడు.

## కె. వి. ఎల్. నారాయణ

"నేను మీ ఊర్లో నా జీవితంలో మూడు వంతులు పైగా గడిపాను. మేము ముందర అనంతపురంలో ఉండే వాళ్ళం. మూడు నుంచి పదో తరగతి వరకు మీ ఊర్లోనే చదివాను. అనంతపురం నుంచి కర్నూలు రావడానికి బస్సు ఎక్కాము. అది నేను మొట్ట మొదటి సారి చేసిన బస్సు ప్రయాణం. లారీలో సామాను పంపాము. అందులో ఉన్న సామాను జాబితా మేము బస్సులో ఉండగా మా నాన్నగారు చూస్తూంటే గాలి కెగిరిపోయింది. ఈనాటికీ నే నెంత వేగంగా ప్రయాణం చేస్తున్న బస్సులో కూర్చున్నా, నేను మొట్ట మొదటి సారిగా చేసిన ప్రయాణంలో బస్సు వెళ్ళినంత వేగంగా ఏ బస్సూ వెళ్ళటం లేదని ఒక తప్పు అభిప్రాయం ఏర్పడింది."

> **ఆత్మీయతకు, ఆప్యాయతకు, అనురాగానికి కొలబద్దలు లేవు. మనిషి ఔన్నత్యాన్ని, గొప్పదనాన్ని దుస్తులు, వేషభాషలు, వస్తువాహనాలు వెల కట్టలేవు. పిచుకగూళ్లు కట్టి ఆడుకొన్న చిన్నతనంలో అంతస్తులు అడ్డురావు. పెరిగిన వయసు, పెంచుకొన్న అంతస్తులు స్నేహాన్ని గుర్తించలేని స్థితికి తీసుకుపోతే, ఆత్మీయతను పెంచుకొన్న మనసు పడే బాధని ఊహించడం కష్టమే.**

నేను శ్రోతనని గుర్తుచేయటం కోసం "అంతేలెండి. మొదటి అభిప్రాయం ఎప్పుడూ చాలా గట్టిగా ఉంటుంది" అన్నాను. నా మాట లతను సరిగ్గా వినిపించుకున్నట్లు లేదు. తన ధోరణిలో తాను తన బాల్యస్మృతులు చెప్పుకుపోసాగాడు.

"బస్సు ఫస్టు గేటు దగ్గర ఆగింది. మా నాన్నగారు పోస్టాఫీసు, దాని ఎదురుగా ఉండే రేకుల షెడ్డు, తరవాత మిడిల్ స్కూలు—అన్నీచూపించుకుంటూ మా ఇంటికి తీసుకు వెళ్లారు. రేకుల షెడ్డులో నేను మూడో తరగతిలో చేరాను. అక్కడ అయిదో తరగతి వరకు క్లాసులు జరిగేవి. కానీ మా అందరినీ క్లాసుల వారీగా విభజించే గోడ లేవీ ఉండేవి కావు. అయిదు క్లాసుల వాళ్ళమూ అయిదు గుంపులుగా కూర్చునే వాళ్ళం. ఒక రోజు ఏమనిపించిందో ఏమీ క్లాసులు జరుగుతున్నప్పుడు గంట కొట్టాను. బడి అయిపోయిందని అందరూ పరుగు తీశారు. కానీ వాళ్ళను మా టీచర్లు వెనక్కు పిలిచారు. చాలా మంది వెళ్ళిపోయారు."

"పెద్ద ప్రాక్టికల్ జోకు చేశారే మీ టీచరు ఏమీ అనలేదా?" అని అనుమానంగా అడిగాను.

"ఎందు కనలేదు? పిచ్చిగా కొట్టి పంపింది." ప్రసాద్ నవ్వుతూ అన్నాడు. నే నతన్ని వింతగా చూస్తూ కూర్చున్నాను, తనకు జరిగిన అవమానం నాతో ఎట్లా చెప్పాడా అని.

"మా అక్కయ్యా వాళ్ళు టౌనులో చదివే వాళ్ళు. కాంప్‌లో మిడిల్ స్కూలు పక్కన పూరి గుడిసె ఉండేది. అది కూలి పోతే తాత్కాలికంగా బడి మూసేశారు. మా వాళ్ళు రోజూ జట్కాలో వెళ్ళే వాళ్ళు. నేను వాళ్ళతోపాటు జట్కా ఎక్కి ఫస్టు గేటు దగ్గర దిగేవాణ్ణి. అప్పుడప్పుడు ఏమీ తోచకపోతే గేటు, చెట్టు ఎక్కి కూర్చునేవాళ్ళం. ఆ రోజుల్లోనే నేను నా మూడో సినిమా చూశాను—'పిల్లలు తెచ్చిన చల్లని రాజ్యం'. సినిమా ఏమీ అర్థం కాలేదు. కానీ గుర్రాలు, మణి, అవి, ఇవి—అన్నీ చాలా బాగున్నాయి."

"మీకు మీరు చూసిన అన్ని సినిమాలు గుర్తున్నాయా?" అతని జ్ఞాపక శక్తికి ఈర్ష్యగా అన్నాను.

"అన్నీ ఎక్కడ గుర్తున్నాయి! అప్పుడు ఏడాదికో, రెండేళ్లకో ఒకసారి సినిమా చూసేవాణ్ణి కనక గుర్తున్నాయి. చిన్నపిల్లవాణ్ణవటం మంచి సినిమాల కంటే ఆటల రంథే ఎక్కువగా ఉండేది. చిన్నవాణ్ణవటం నుంచే ఆ కాలంలో బిర్లా వనస్పతి కంపెనీలోకి రానిచ్చేవాళ్ళు. తిన్నన్ని వేరుశెనక్కాయలు తిని జేబులు నింపుకుని ఇంటికి బయలుదేరే వాళ్ళం, నేనూ, మా తమ్ముడూ. ఇంటికి తీసుకు వెళితే మా అమ్మ కనుక్కుని దొంగతనం చేశామని తన్నుతుందేమోనని దారిలో కనిపించిన వారందరికీ ఇచ్చేవాళ్ళం. బడి మీద, పాఠాల మీద కంటే నా శ్రద్ధ వీటి మీద ఎక్కువవటంతో, రోజూ ఉండే డిక్టేషనులో మార్కులు తక్కువ వచ్చేవి. హఠాత్తుగా నాకు రోజూ ఉండే డిక్టేషనులో, వ్యాసాలు వ్రాయటంలో పదికి పది మార్కులు రావటం మొదలయ్యాయి. చూడగా చూడగా అనుమానం వచ్చి మా అమ్మ అడిగింది—'ఎట్లావస్తున్నాయిరా, నీకిన్నిమార్కులు?' అని. మా అమ్మ నన్ను మెచ్చుకుంటున్నదని మురిసిపోతూ, 'ఏముందీ! ముందర వ్రాసేదీ, తరవాత పైపైన తుడిపేస్తే టీచరుకు సరిగ్గా కనిపించదుగా? ఆమె పదికి పది ఇస్తుంది' అన్నాను. ఆవేళ మా అమ్మ నా ప్రాణాలు తీసేది. మధ్యలో మా తమ్ముడు ఏడుపు లంకించుకుంటే

వాణ్ణి సముదాయిస్తూ, నన్ను వదిలి పెట్టింది. మా నాన్నగారు రాగానే నా మీద ఫిర్యాదు చేసింది — 'పిల్ల వాడు చెడిపోతున్నాడు. వాడితో తిరిగి వాడి తమ్ముడు కూడా చెడుతాడు. ప్రైవేటు పెట్టించం'డని. మా నాన్న గారు సరే నన్నారు. మేము ప్రైవేటు వద్దని ఏడిస్తే, వద్దులే అని మమ్మల్ని ఓదార్చారు."

"మీ నాన్నగారికి మీరంటే చాలా ఇష్టంలాగుందే?" అన్నాను.

దానికి ప్రసాద్ — "మేము చిన్నప్పుడు చేసే ప్రతి పని మా నాన్నగారికి నవ్వు తెప్పించేది. మా తమ్ముడు మా అమ్మ వద్ద దెబ్బలు తప్పించినందుకు, ప్రైవేటు వద్దని నాతోపాటు ఏడ్చినందుకు ఏమయినా కొనుక్కోమని మా నాన్నగారు అప్పుడప్పుడు ఇచ్చే డబ్బులన్నీ వాడికే ఇచ్చేవాణ్ణి. అప్పుడు మా వీధిలోనే ఒక ప్రైవేటు మాస్టా రుండేవారు. ఒక రోజు మా అన్నా మా తమ్ముడూ ఆయన పాఠాలు తనిఖీ చేయడానికన్నట్టు కుతూహలంతో ఆయన ప్రైవేటు చెప్పే టప్పుడు చూడ్డాని కెళ్ళారు. బయటి నుంచి తొంగి తొంగి చూసి, మా అన్నయ్య మా తమ్ముడి చెవిలో ఏదో చెప్పి ఇంటికి పరుగెత్తు కొచ్చాడు. మా తమ్ముడు ప్రైవేటు మాస్టారు దగ్గిరికి వెళ్ళి జేబులో చేతులు పెట్టుకుని, 'ఏమండీ! మీ కొకటి చెప్పాలి' అన్నాడు. ఏమిటని ఆయన అడిగితే 'షటప్' అని గట్టిగా అరిచాడు. వాణ్ణి ఆయన కొట్టడానికి వస్తే పరుగెత్తు కొంటూ మా ఇంటి కొచ్చి మా అమ్మ వెనక దాక్కున్నాడు. ఈయన వాడి వెనక పడుతూ లేస్తూ, మా ఇంటి కొచ్చి జరిగిందంతా మా అమ్మకు చెప్పాడు. అప్పుడే మా గురించి వాకబు చేసి ఆయన మాకు చుట్టమని తేల్చాడు. ఫలితంగా మే మాయన వద్దకు రోజూ ప్రైవేటుకు వెళవలసి వచ్చింది" అన్నాడు.

"ఏమైతేనేమి — చివరకు మీకు ప్రైవేటు తప్పలేదు" అని తెరలు తెరలుగా నవ్వుతూ అన్నాను.

ఆయనా నవ్వుతూ చెప్పటం కొనసాగించాడు: "ప్రైవేటులో చేరి ఆరు నెలు తిరగక ముందే నేను నాలుగో క్లాసులో కొచ్చాను. అప్పట్నుంచి నా కంటే తక్కువ తరగతి పిల్లలకు లెక్కలు, వచనము, డిక్టేషను, చూచివ్రాత, చదువు కొచ్చింది అప్పచెప్పుకోవటం అన్నీ చేసేవాడిని. కూచిపూడి నృత్యం చేసే శోభ అనే అమ్మాయి గురించి ప్రభలో ఒకసారి వ్రాశారు. ఆ అమ్మాయి మా ప్రైవేటులోనే చదివింది. మా మాస్టారు 'బి' కాంపు నుంచి 'సి' కాంపులోకి మారారు. అంత దూరం రోజూ ప్రైవేటుకు వెళ్ళి మళ్ళీ బడికి నడిచి వెళ్ళలేకా, లెక్కలు రానందుకు మా తమ్ముణ్ణి ఆయన కొడుతూన్నందుకూ ప్రైవేటు ఎగగొట్టి ఊళ్ళోపడి తిరిగే వాళ్ళం. అది కనుక్కుని మా నాన్నగారు మమ్మల్ని ఆయన వద్దకు తీసుకెళ్ళి అప్పజెప్పి, 'ఈసారి బడి ఎగగొడితే వీపు విమానం మోత మోగుతుం' దనీ, మా మాస్టారు 'గోడ కుర్చీ వేయిస్తా' ననీ చెప్పటం జరిగింది. ఈ తంతు వారాని కొక సారన్నా జరిగేది. అయితే ఆరో తరగతికి రాగానే నేను ప్రైవేటు మానేశాను. మా తమ్ముడు బడి మాని ప్రైవేటులోనే ఉండిపోయాడు. ఎండలో నడవలేడని మధ్యాహ్నం ఆయన వాడిని ఇంటికి పంపేవాడు కాదు. చదువు చెప్పి, భోజనం పెట్టి నిద్ర పొమ్మనే వాడు. సాయంత్రం మళ్ళీ చదువు చెప్పి ఇంటికి పంపేవాడు. అయితే తాను తీసుకునే అయిదు రూపాయల జీతం ఎక్కువ చేయలేదు. మా తమ్ముడి షటప్ నుంచి మా రెండు కుటుంబాలు బాగా కలిసి పోయాయి."

"మీ మాస్టారు చాలా మంచి వారు లాగున్నారే" అని ఒక కాంప్లిమెంటు ఇచ్చాను.

"నిజమే. ఏ లోకాన ఉన్నారో కానీ, నాకు, మా తమ్ముడికి ఆయన దయ వల్లనే నాలుగు అక్షరంముక్కలు అబ్బాయి" అని తన ఉపాధ్యాయునికి మనసులోనే అంజలి ఘటిస్తూ అన్నాడు. మళ్ళీ అతనే — "నే నేమీ మీకు విసుగు పుట్టించలేదు కదా?" అని సిగ్గుగా అడిగాడు. "అబ్బే, నాకూ ఉత్సాహంగా ఉంది. చెప్పండి. వింటాను" అని అతన్ని ప్రోత్సహించాను. అతను నవ్వుతూ, "మా ఇంట్లో నన్ను చిన్నప్పుడు 'వడగళ్ళు' అని ఏడిపించేవారు. నేను మాట్లాడితే అలా ఉండేదిట. మిమ్మల్ననవసరంగా విసిగిస్తున్నాను" అన్నాడు. నే నతన్ని మళ్ళీ ప్రోత్సహించాను.

"నే నయిదో తరగతి చదువుతున్నప్పుడు బి. ఇడి. ట్రెయినింగ్ కాలేజి కడతూండే వాళ్ళు. అప్పట్లోనే 'ప్రేమ కానుక' సినిమా వచ్చింది. నాగేశ్వర రావు లాగా మోటారు సైకిల్ మీద వెళుతున్నా మనుకుంటూ, రకరకాల శబ్దాలు చేసుకుంటూ ప్రైవేటు స్కూలు నుంచి రోజూ ఇంటర్వెల్ ఇవ్వగానే ఆ కాలేజీకి పరుగెత్తే వాళ్ళం. సాయంత్రం కాగానే ఇసుకలో గూళ్ళు కట్టుకునేందుకు వెళ్ళేవాళ్ళం. కడుతున్న గోడల మీద నుంచి క్రింద ఇసుకలోకి దూకేవాళ్ళం. మా ఇంటి దగ్గిరి ఆడ పిల్లలతో కలిసి ఇసుక గూళ్ళు కట్టుకుని, మా ఇంటికి పేరంటానికి రండనో, పెళ్ళికి రండనో పిలుస్తూ ఆడుకునే వాళ్ళం. కాలేజీ కట్టడం పూర్తికావటం, నేను హైస్కూలోకి రావటం—రెండూ ఒకేసారి జరిగాయి. అప్పట్నుంచి క్రికెట్, బాల్ బాడ్మింటన్, హాకీ, ఫుట్‌బాల్, గోలీలు, బచ్చాలు, సబ్జా—ఇట్లా ప్రపంచం లోని ఆటలన్నీ ఆడేవాళ్ళం. హోమ్ వర్కు చేసేవాణ్ణి కాదు. ప్రశ్నలకు బళ్ళో జవాబు లిచ్చేవాణ్ణి కాదు. ఏం చేస్తావురా ఇంట్లో అని ఎవరయినా అడిగితే, క్రికెట్ ఆడుతున్నానని అనే వాణ్ణి. మాచ్‌లు ఆడేవాళ్ళం. మేము గెలవగానే కాప్టెను పేరు, రన్సు ఎక్కువ కొట్టిన వాడి పేరు, ఎక్కువ వికెట్లు తెచ్చుకున్నవాడి పేరు చెప్పి జై అనే వాళ్ళం. ఓడిపోయిన వాళ్ళ ఉక్రోషం పట్టలేక 'భో, భో' అని అరిచే వాళ్ళు.

## ప్రేమ పరీక్ష

ఒక యువకుడు ఒక వేదాంతి దగ్గరకు వెళ్ళి అడిగాడు- "స్త్రీ ప్రేమ పొందడానికి ప్రధానంగా కావలసిందేమిటి?" అని. ఆయన- "అవకాశం" అన్నాడు.

— మూర

మేము వాళ్ళను ఇంకా ఏడిపించేవాళ్ళం. అట్లాంటి సమయంలోనే ఒక ఓడిపోయిన టీము కాప్టెను రాయి తీసి మా అన్నను కొట్టాడు. అది మా అన్నకు కంటిపైన తగిలి రక్తం వచ్చింది. సగం మంది మా అన్నను ఇంటికి, అక్కణ్ణించి హాస్పిటల్‌కు తీసుకెళ్ళారు. మిగతా సగం మంది రాయి విసిరిన వాడి వెంట పడి పరుగెత్తారు. వాడు దొరక్కుండా పారిపోయాడు. ఇట్లాగే అన్ని రకాల ఆటలతో నా బాల్యం జరిగిపోయింది." నిట్టూరుస్తూ ప్రసాద్ అన్నాడు.

"నేను ఏడో తరగతిలో ఉన్నప్పుడు లక్ష్మీనారాయణ గుడికి స్వామి చిన్మయానంద వచ్చారు. అప్పుడే తెలిసింది జేబు దొంగను జైల్లో పెట్టినా, జేబులు కొట్టే కళ మరిచిపోకుండా ఉండటానికి తన జేబులో వస్తువులను కొట్టేసుకోవటం ప్రాక్టీసు చేస్తాడని." మే మిద్దరమూ నవ్వుకున్నాము. అప్పుడే ఆయ నింకొక విషయం కూడా చెప్పాడు:

"ఒక తండ్రి తనకొడుక్కి రిక్షా చూపించి, నీవు చదువుకోకపోతే నీ కిదే గతి అని చెబుతాడుట. బాగుపడే కొడుకయితే, రిక్షాను చూసినప్పుడల్లా భయంకొద్దీ చదువుతాడుట. ఈ మాటలే మా నాన్న గారు కూడా ఇంటి కొచ్చిన తరవాత చెప్పారు. అప్పటినుంచి బుద్ధిగా చదువుకోవటం మొదలు పెట్టాను!"

"అయితే, మీరు బాగుపడుండాలి" అని వ్యంగ్యంగా అన్నాను.

నా వ్యంగ్యాన్ని అతను అర్థం చేసుకున్నట్లు లేదు. "చదువుకునే వాడినే కాని, ఆటలకుమాత్రం తప్పకుండా వెళ్ళే వాడిని. సెలవు లివ్వగానే తెగ అల్లరి చేసేవాడిని. ఊళ్ళోపడి తిరిగే వాళ్ళం. చింత చెట్లు పూతవేయటం మొదలుపెట్టినప్పటినుంచి ఆ చెట్లమీదనే ఉండే వాళ్ళం. చింతకాయలు కోసుకుతినేవాళ్ళం. కాపలావాళ్ళు మమ్మల్ని పట్టుకునేందుకు శ్రమపడేవాళ్ళు. కానీ, ఒక్కనాడు కూడా దొరకలేదు. పళ్ళు పులుపెక్కి, అన్నం తినటం కష్టమయ్యేది. ఇంట్లో కోప్పడతారని ఇంటికి రాగానే ఉప్పుతో పళ్ళు తోముకునే వాళ్ళం. నంద్యాల రోడ్డులో చాలా పైకి పోతే ఎర్ర చింతకాయల చెట్టుంది. చింతకాయలు ఎంత పిందెలను త్రుంచినా లోపల ఎర్రగా రక్తం లాగా కనుపించేది. ఆ చెట్టును వెదికి గుర్తుపెట్టుకునేవాళ్ళం. కానీ మళ్ళీ వెళ్ళేటప్పటికి ఆ గుర్తు తీసేసేవాళ్ళు కాపలాదారులు. ఒకసారి మా గుర్తు తీసేస్తే ఎంత వెదికినా చెట్టు కనుపించక పోయేసరికి ఉక్రోషంతో తిరిగి వస్తున్నాం. అప్పుడు మా కొక బస్సు ఎదురయింది. మేము మా చింతకాయలను తీసి బస్సులోకి విసిరేశాం. లోపల ఎవరికో తగిలింది. కండక్టరు బస్సు ఆపి, మాలో ఒకణ్ణి పట్టుకున్నాడు. రెండు మైళ్ళు తీసుకెళ్ళి, 'ఈసారి చేస్తే జైల్లో పెట్టిస్తా' నని బెదిరించి వదిలిపెట్టాడు. అప్పట్నుంచి ఎవ్వళ్ళమూ బస్సుల జోలికి వెళ్ళేవాళ్ళము కాదు." చెప్పటం ఆపి ప్రసాద్ చిన్నగా నవ్వటం మొదలు పెట్టాడు.

నేనుకూడా నవ్వుతూ, "నా కటువంటి అనుభవం ఒకటుంది, చెబుతా వినండి" అని చెప్పాను. "పంటలు నాశనం అవుతున్నాయని వాటి మీద మందు చల్లటానికి ఒక హెలికాప్టర్ ఒకసారి కర్నూలు వచ్చింది. దాన్ని చూడ్డానికి మేము కొంతమంది వెళ్ళాము. అది క్రిందకి దిగటమూ, పైకి ఎగరటమూ, దాని ఆకారమూ—అన్నీ కుతూహలంగా చూస్తున్నాము. కొంతసేపటికి చాలా దాహం వేసింది. మంచినీళ్ళ గ్లాసు పది

పైసలకు అమ్ముతున్నారు. మా దగ్గర డబ్బులు లేవు. అందుకని అందరం వెంకన్న బావికి వెళ్లి నీళ్లు తాగి వస్తూన్నాం. వస్తూ వస్తూ వేరుశెనగ కాయల చెట్లు కనుపిస్తే, అవి పీకి వేరుశెనగ కాయలు కొయ్యటం మొదలు పెట్టాము. ఇంతలో కాపలావాడు వచ్చి మమ్మల్ని పట్టుకున్నాడు. మమ్మల్నం దరిని దిన్నె దేవరపాడులో వాళ్ల ఆసామీ దగ్గరకు తీసుకు వెళుతున్నాడు. అప్పుడు అదను చూసి మాలో ఒకడు ఉడాయిం చాడు. కాపలావాడు వాడి వెంట పడితే, మేము మరొక దారిని రెండున్నర మైళ్లూ పరుగెత్తి ఇళ్లు చేరుకున్నాము.''

''హెలికాప్టరు వచ్చినప్పుడు మీ రేం చదువుతుండేవాళ్లు?'' ప్రసాద్ అడిగాడు.

''ఏడు'' అని నాలిక్కరుచుకుని, ''అహాఁ ఎనిమిది'' అన్నాను. నా జవాబుతో ప్రసాద్ మొహం మాడిపోయింది. అంతదాకా ఉత్సాహంగా ఉన్న తను ఒక్కసారి నీరసించి పోయాడు. కొద్ది సేపటిదాకా నిశ్శబ్దంగా కూర్చుని, ''రాత్రయింది, పడుకోండి. గుడ్ నైట్!'' అని ముసుగు తన్నాడు. నే నేదో ఆలోచించుకుంటూ నిద్రపోయాను.

మరుసటి రోజు పొద్దున్న అతను చాలా ముభావంగా ఉండిపోయాడు. రాత్రి అంతసేపూ నవ్వుతూ మాట్లాడిన అతను, పొద్దున్నే అంత ముభావంగా ఉంటే నాకు చాలా బాధగా అనిపించింది. 'నేనేమీ తప్పు చేయలేదు కదా' అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. అతనితో అసలు విషయం చెప్పేసి మనసు ప్రశాంత పరుచుకుందామని చాలాసార్లనిపించింది. కానీ, ముందు రోజు అతను నాతో ఎంత కలుద్దామని ప్రయత్నించినా, నాలోని అహంభావం అడ్డు వచ్చి అతన్ని నొప్పించాను. కర్నూలు చేరగానే అత నెన్ని రోజు లుండదలచింది అడిగాను. ''వారం రోజు లుంటా నన్నారు గదా! వీలుచూసుకుని మా హాస్టలుకు రండి'' అని ఆహ్వానించాను. నా పిలుపు అతన్ని ఆనందపరిచినట్లుంది. ఇద్దరమూ రిక్షాలో ఉన్నంతసేపూ మాట్లాడాడు. అతను తాము కర్నూల్లో ఉన్నప్పుడు ఉండే ఇల్లు చూస్తాడుట.

''మే మిదివర కున్న ఇల్లు చూడాలి. ఇంటి ఎదురుగా చెట్టు ఉంది. ఒక సారి ఆ చెట్టు ఎక్కాను, అందరూ వద్దంటున్నా. అక్కడి నుంచి పడితే అందరూ నవ్వారు. నేను దుమ్ము దులుపుకుంటూ 'భలే పడ్డా' అని మా అమ్మ దగ్గరి కెళ్లి ఆమె దగ్గర కూర్చుని ఏడ్చాను.'' అతని మాటలు నాకు చాలా నవ్వు తెప్పించాయి. తరవాత తన ప్రోగ్రాము చెప్పాడు. తన స్నేహితులను, ఆటస్థలాలను, జనరల్ ఆస్పత్రిని చూస్తాడుట. తన టీచర్లను కలుసుకుంటాడుట. అతను చెబుతూండగానే మా హాస్టలు వచ్చింది. అతనికి నా ఆహ్వానం గుర్తుచేసి వెళ్లి పోయాను. అతను రిక్షాను వెనక్కు తిప్పించి హోటలులో ఉండేందుకు వెళ్లాడు. అతన్ని నాతోపాటు ఉండమని నేను ఎందు కనలేదో నా కర్థం కాలేదు. నా పూర్తి పేరుకూడా అతనికి చెప్పలేదు. గది నంబరు చెప్పలేదు. అతను నాకన్న తక్కువ వాడన్న అర్థంలేని భావమొక్కటి నా మనసులో ఉండిపోయి, అతన్ని మళ్లీ కలుసుకోకూడదన్న ఆలోచన నా మనసులో మరుగున పడి ఉండి ఉంటుంది. అందుకే అతనితో అలా వ్యవహరించా ననుకున్నాను.

మరుసటి రోజు పేడియాట్రిక్స్ క్లినిక్ అటెండవుతూ ఉంటే నా స్నేహితుడు నా కొక ఉత్తర మిచ్చాడు, ప్రసాద్ నుంచి.

కర్నూలు.


''భూషణ్,

నేను వెళ్లిపోతున్నాను, సాయంత్రం బండిలో, ఈవేళే.

నీవు వేష భాషలలోనే కాక, ఆకారం లోనూ, ఆలోచనా సరళిలోనూ చాలా మారిపోయావు. నిన్ను గుర్తించి అవునా, కాదా అన్న సందేహంతో నిన్ను కదిపాను. చిన్నప్పుడు నాతో కలిసిమెలిసి తిరిగిన నీవు కూడా నా మీద అభిమానం చూపలేకపోయావు. హెలికాప్టర్ గురించి నీవు చెప్పకపోతే, నీవు భూషణ్ కావను కునే వాడిని. అన్నేళ్ల పొరపొచ్చాలు లేక నడిచిన మన సాన్నిహిత్యాన్ని క్రూరంగా నాశనం చేశావు. నా దుస్తులు చూసేగా? బహుశా నా గుడ్డలు చూస్తే నేను నీ కంటే తక్కువవాడుగా కనుపించి ఉంటాను. అందుకే నన్ను కించపరిచావు. మిమ్మల్ని అందరినీ చూద్దామని ఉత్సాహంతోవచ్చి దారుణమైన హృదయ క్షోభతో తిరిగి వెళుతున్నాను.

భూషణ్!

ఆత్మీయతకు, ఆప్యాయతకు, అనురాగానికి కొలబద్దలు లేవు. మానవత్వపు విలువలను, మనిషి ఔన్నత్యాన్ని, గొప్పదనాన్ని దుస్తులు, వేషభాషలు, ధన కనక వస్తు వాహనాలు వెల కట్టలేవు. మహాత్ముడుగా కీర్తించబడే గాంధీగారు అర్ధనగ్నంగా ఇంగ్లాండు కూడా వెళ్లి వచ్చారు. శక్తిసంపన్నుడయికూడా మహేశ్వరుడు చర్మం చుట్టుకుని, కపాలం పట్టుకుని భక్తులకు సాక్షాత్కరిస్తాడు.



ప్రాచనం ప్రక్కనే ఆధునికం ఫోటో—పి. ఎ. వివేకానందన్ (మద్రాస్-3)

చిన్నప్పుడు ఇసుకతో గూళ్లు కట్టుకుంటాం. వాటి నెవరైనా తొక్కివేస్తే కోపంతో, ఉక్రోషంతో ఏడుపు వస్తుంది. అటువంటప్పుడు నేను పదిలంగా దాచుకున్న నా సజీవ స్మృతులను నిర్దాక్షిణ్యంగా నాశనం చేసి, నా మందిరాలను కూలద్రోసి మీరు మీ భవంతులను కట్టుకున్న ట్లనిపించి హృదయ క్షోభ కలుగుతూంది.

నా దుస్తులు మామూలైనందుకు నన్ను కించపరిచావు. మిగతా స్నేహితులు నేను మెడికల్ స్టూడెంట్ నని తెలిసి, తమ పాత స్నేహితుడని కూడా మరిచి 'ఏరా, నీవు' అన్న వాళ్ళు, 'ఏమండీ, మీరు' అన్నారు. నే నాటలాడుకున్న స్థలాలలో ఈ నాడు భవంతులు లేచాయి. వామీద సహజమయిన చిన్నతనపు అభిమానం చూపిన నా మిత్రుల ఆలోచనలు వ్యాపార రీతిలో వక్రీకరించాయి. ప్రపంచంలో ప్రతిదీ మారేదే. అలా అనుకునే నన్ను నేను సరిపెట్టుకునే ప్రయత్నం చేస్తాను.

నా ఉత్తరం నీకు కష్టం కలిగిస్తే క్షమించు.

శ్రేయోభిలాషి, ప్రసాద్.''

అతని ఉత్తరం చూసిన తరవాత నాకు పశ్చాత్తాపం కలిగింది. నాకు లోకుల నుంచి ఏదైనా నచ్చని పని జరిగితే, ఈ ఉత్తరం చదువుకుంటాను. ఆ ఉత్తరం ఎప్పుడూ నా లోపాన్ని గుర్తు చేస్తుంది. అప్పుడు నాకు లోకుల మీద కోపం రాదు. నా జీవితంలో నాకు లభించిన అమూల్యమయిన వస్తువులలో ఈ ఉత్తర మొకటి. ★